క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం 11కేవీ రాక్‌టౌన్ కాలనీ ఫీడర్ పరిధిలోని లలితానగర్, అయ్యప్పకాలనీ పరిసర ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్ నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

మాజీ మేయర్‌కు సన్మానం



పారిజాత దంపతులకు సన్మానిస్తున్న కాలనీవాసులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 31వ డివిజన్ సాయిబాలాజీ హోమ్స్–2 కాలనీలో కాలనీవాసులు సోమవారం ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మాజీ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి దంపతులను భారీ గజమాలతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అడిగిన వెంటనే కాలనీల్లో ఉన్న సమస్యలు పరిష్కరించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పారిజాత మాట్లాడుతూ.. 31వ డివిజన్‌లో కార్పొరేటర్‌గా తనను ఎన్నుకొని గెలిపించినందుకు కాలనీవాసులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు తగ్గించాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీల ప్రతినిధులు

మీర్‌పేట: ఇంటి పన్నులను తగ్గించాలని మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని కాలనీల ప్రతినిధులు సోమవారం కమిషనర్ జ్ఞానేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీల ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వంటేరు నర్సింహారెడ్డి, అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజలు అధికంగా నివాసం ఉండే మీర్‌పేట ప్రాంతంలో అధిక ఇంటి పన్నులతో భారం పడుతోందన్నారు. జీహెచ్ఎంసీ, పక్కనే ఉన్న బడంగ్‌పేటలో అనుసరిస్తున్న మాదిరిగా వార్షిక అద్దె విలువ ప్రకారం ఇక్కడ కూడా పన్నులు విధించాలన్నారు. 36 కాలనీల ప్రతినిధులతో సమావేశమై పెంచిన ఇంటి పన్నులను తగ్గించాలని డిమాండ్ చేశారు.

‘అర్చకుడిపై దాడిని ఖండిస్తున్నాం’



అర్చకుడి దాడిపై మాట్లాడుతున్న బ్రాహ్మణ సేవా సంఘం అర్చకులు

బడంగ్‌పేట్: చిలుకూరి బాలాజీ మందిర ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై జరిగిన దాడిని సోమవారం బడంగ్‌పేట బ్రాహ్మణ సేవా సంఘం అర్చకులు తీవ్రంగా ఖండించారు. సోమవారం స్థానికంగా ఉన్న కాశీబుగ్గ దేవాలయంలో సంఘం అధ్యక్షుడు మంగు రాఘవరావు మాట్లాడుతూ.. హైందవ ధర్మరక్షణకు దైవ సేవకు అంకితమైన రంగరాజన్‌ను కొందరు సంఘ విద్రోహ శక్తులు పూనుకున్నారన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు మదన్‌మోహనాచార్యులు, భద్రయ్య, కులకర్ణి, వెంకట సుబ్రహ్మణ్యం, మాధవరావు తదితరులు ఉన్నారు.

పార్కు అభివృద్ధికి వినతి



వినతిపత్రం ఇస్తున్న సీతారాములు

ఎల్బీనగర్: మన్సూరాబాద్ డివిజన్ పరిధి కమలానగర్‌కాలనీలోని పార్కు స్థలాన్ని అభివృద్ధి చేయాలని మాజీ ఎమ్మెల్సీ సీతారాములు, కాలనీ సలహాదారులు వనం శాంతికుమార్‌తో కలిసి కమిషనర్ ఇలంబర్తికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. పార్కును అభివృద్ధి చేస్తే స్థానికులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. పార్కు అభివృద్ధికి కృషి చేస్తానని కమిషనర్ హామీ ఇచ్చారన్నారు.



అమ్మవారి కల్యాణం జరిపిస్తున్న ఒగ్గు కళాకారులు



కల్యాణం వీక్షిస్తున్న భక్తులు

నేత్రపర్వం.. పెద్దమ్మ కల్యాణం

- కనుల పండువగా అమ్మవారి కల్యాణోత్సవం
- భక్తులతో కిక్కిరిసిన గరిగుట్ట ఆలయ ప్రాంగణం

పహాడీషరీఫ్: జల్‌పల్లి మాదన్నగూడలోని గరిగుట్ట పెద్దమ్మ ఆలయం సోమవారం భక్త జనసంద్రంగా మారింది. అమ్మవారి కల్యాణ మహోత్సవం నేత్రపర్వంగా కొనసాగింది. ఉత్సవాలు చివరి రోజు కావడంతో ఒగ్గు కళాకారులు ఆలయ ఆవరణలో సదరు పటాన్ని వేశారు. అనంతరం ఆలయ ధర్మకర్త కరన్‌కోట్ విఠల్‌బాబా పర్యవేక్షణలో అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. శివ సత్తులకు ఆచారాల సమర్పణ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ సందర్భంగా జరిగిన అమ్మవారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కల్యాణం అనంతరం విఠల్ బాబా అమ్మవారితో ఆలయంలో దాదాపు 50 మంది శివసత్తులతో కలిసి అగ్నిగుండాల ప్రవేశం చేశారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్ పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బుడుమాల యాదగిరి, పండెం కొండల్ యాదవ్, నాయకులు చింతకింది నవీన్‌గౌడ్, యంజాల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపులో భక్తులు



అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని కల్యాణ మహోత్సవానికి తీసుకొస్తున్న విఠల్‌బాబా

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తామని చెప్పారు. జిల్లా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రాయితీ కింద మంజూరైన స్ప్రింక్లర్లను సోమవారం ఆయన కడ్తాల్ మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతుభరోసా అందజేస్తున్నామని తెలిపారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. కులగణన, ఎస్సీ వర్గీకరణ నిర్ణయాలు ప్రభుత్వ చరిత్రాత్మకమని, స్థానిక ఎన్నికల్లో ప్రజలంతా కాంగ్రెస్‌కు అండగా నిలవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేశ్, ఏడీఏ ఆదిలక్ష్మి, వ్యవసాయాధికారి శ్రీలత, సింగిల్‌విండో డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, మార్కెట్ డైరెక్టర్ నరేశ్‌నాయక్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బిక్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

రంగరాజన్‌పై దాడి సరికాదు

ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ తిరుపతిగా పేరొందిన చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేయడం సరైంది కాదని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. ఒక వ్యక్తిపై కాదు.. ధర్మ పరిరక్షణపై దాడిగా భావిస్తున్నామన్నారు. ధర్మ పరిరక్షణ కోసం దేవాలయంలో ఉంటూ నిత్య పూజలు నిర్వహిస్తున్న అర్చకుడిపై దాడి చేయడం సరైంది కాదన్నారు. నిందితులపై కఠిన చర్యలకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

అర్చకుడిపై దాడి అమానుషం

షాద్‌నగర్‌రూరల్: చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై శ్రీరామసేవ పేరుతో కొందరు వ్యక్తులు దాడికి పాల్పడటం అమానుషమని విశ్వహిందూ పరిషత్ క్షేత్ర ప్రముఖ్ బండారి రమేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుష్టశిక్షణ, శిష్ట రక్షణ అనే సూక్తితో రాజ్యపాలనను కొనసాగించిన శ్రీరామచంద్రుని సైన్యం పేరు పెట్టుకొని ప్రధాన అర్చకుడిగా ఆత్మ భోదన కార్యక్రమాలను చేపడుతున్న అర్చకుడు లక్ష్యంగా చేసుకొని దాడికి పాల్పడటం హేయమైన చర్య అని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక సేవలకు విశ్వహిందూ పరిషత్ నిరంతరం అండగా ఉంటుందని తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడిపై జరిగిన దాడిని వీహెచ్‌పీ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. ఇలాంటి చర్యలను విశ్వహిందూ పరిషత్ సహించదని, దాడికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పార్టీ గెలుపే లక్ష్యం

మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మొయినాబాద్‌రూరల్: పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో మొయినాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా కేతిరెడ్డిపల్లి దారెడ్డి వెంకట్‌రెడ్డిని నియమిస్తూ మాజీ మంత్రులు కేటీఆర్‌తో పాటు సబితాఇంద్రారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరిని పార్టీ అధిష్టానం గుర్తిస్తుందన్నారు. అనంతరం నూతనంగా మండల అధ్యక్షుడిగా ఎన్నికైన దారెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ గెలుపే లక్ష్యంగా అందరితో కలిసి పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ ఉపాధ్యక్షురాలు మంజులరవియాదవ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కార్తీక్‌రెడ్డి, కొంపల్లి అనంతరెడ్డి, రవియాదవ్, శ్యామ్‌రావు, షాబాద్ దర్శన్, జీవంతు, స్వప్న, జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీహరి యాదవ్, వివిధ గ్రామాల పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ టోర్నీ

ఆమనగల్లు: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ టోర్నీ సోమవారం ముగిసింది. పోటీల్లో విన్నర్‌గా ఆమనగల్లు స్ట్రైకర్స్ టీమ్, రన్నర్‌గా లోకల్ స్టార్ టీమ్ నిలిచాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మహేశ్, వాలీబాల్ క్రీడాకారుడు మనోహర్‌రెడ్డిలు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు జగన్, పవన్ కల్యాణ్, రమేశ్, మహేందర్, ఆర్గనైజర్లు దేవేందర్, రవి, సురేశ్, చాంద్‌పాషా, గౌస్, భరత్, మల్లేశ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్లకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

సీసీరోడ్ల పనులు ప్రారంభం

ఆమనగల్లు: కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లి గ్రామంలో రూ.30 లక్షలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను సోమవారం కాంగ్రెస్ నాయకులు యాదయ్యగౌడ్, కరుణాకర్, సుమన్‌లు ప్రారంభించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో గ్రామ పంచాయతీ భవనానికి రూ.20 లక్షలు, సీసీరోడ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు, మురుగు కాల్వ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరయ్యాయని వారు వివరించారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశ్‌గౌడ్, బాబు, రాములు, పెద్దయ్య, రాజు, మధు, శ్రీను, వెంకటేశ్, నరేశ్, చెన్నయ్య, సుంకయ్య, చందు, శివ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న నాయకులు

డిగ్రీ కళాశాలతో అబీస్ కాస్మోటిక్ సైన్స్ ఎంఓయూ

శంషాబాద్: రాజేంద్రనగర్ (శంషాబాద్) ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో సింగపూర్ విశ్వవిద్యాలయం ఎంఓయూ కుదుర్చుకుంది. అబీస్ ఇన్‌స్టిట్యూట్ కాస్మోటిక్ సైన్స్ ఆన్‌లైన్ ద్వారా కోర్సులు అందించేందుకు అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సింగపూర్ వర్సిటీ అంతర్జాతీయ సెమినార్‌లో కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి పలు పరిశోధనలు సమర్పించారు. ఆ వేదికపై సామ రవీందర్‌రెడ్డి అభ్యర్థన మేరకు ఈటబుల్ కాస్మోటిక్స్‌పై చర్చించిన అబీస్ కాస్మోటిక్ సైన్స్ ఇన్‌స్టిట్యూట్ రాజేంద్రనగర్ డిగ్రీ కళాశాలతో పాటు షాద్‌నగర్‌లోని మొగిలిగిద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆన్‌లైన్ కోర్సులు నిర్వహించేందుకు ముందుకు వచ్చింది. ఫ్రాన్స్‌లోని యూరోపియన్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయంతో ఈ సంస్థ కలిసి పనిచేస్తోందన్నారు. కాస్మోటిక్స్ రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలుండడంతో కళాశాలలో ఈ కోర్సును ప్రవేశపెడితే ప్రధానంగా విద్యార్థినులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు.

ఏఐ పాత్ర కీలకం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు

శంషాబాద్: నైపుణ్యం ఉన్నవారికి మెరుగైన ఉపాధి అవకాశాలున్నాయని రాజేంద్రనగర్ (శంషాబాద్) ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు సూచించారు. అనేక రంగాల్లో ఇప్పుడు ఏఐ పాత్ర కీలకంగా మారిందన్నారు. మహిళా సాధికారతలో భాగంగా సోమవారం డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు లెర్నింగ్ లింగ్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన కృత్రిమ మేధ (ఏఐ) పదిరోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. పోటీ సమాజంలో నిలదొక్కుకునేందుకు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ భవాని, అధ్యాపకులు భాను ప్రకాష్ పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యను అందించాలి

హస్తినాపురం: విలువలతో కూడిన విద్యను బోధించాలని భవిష్య విద్యాసంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హస్తినాపురంలోని దేవకమ్మతోటలోని భవిష్య పాఠశాల వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులను విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో రాణించేందుకు అన్ని విధాల కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రమ, అకాడమిక్ డైరెక్టర్ శాలిని, ప్రిన్సిపాల్స్ సాయి, సంతోష్, వైస్ ప్రిన్సిపాల్ మమతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు సకాలంలో చికిత్స అందించాలి

పశు సంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ శ్రావణ్‌కుమార్

కందుకూరు: పశువులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న మందులను సద్వినియోగం చేసుకొని, ఆర్థికంగా లబ్ధి పొందాలని పశు సంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ శ్రావణ్‌కుమార్ రైతులకు సూచించారు. సోమవారం మండల పరిధిలోని అన్నోజిగూడలో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు మందులు పంపిణీ చేసి మాట్లాడారు. సీజనల్ వ్యాధులు, వ్యాక్సినేషన్, పాల మార్కెటింగ్, జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. పాడి రైతులు పశుపోషణలో మెలకువలు పాటిస్తూ పశు వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలని సూచించారు. కాగా మొత్తం శిబిరంలో 86 పాడి పశువులకు చికిత్సలు అందించామని, అందులో 42 పశువులకు గర్భకోశ వ్యాధికి సంబంధించిన చికిత్సలు చేసినట్లు పశు వైద్యాధికారిణి డాక్టర్ రేవతి తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్యులు డాక్టర్ షాహిన్‌షైన్, నాయకులు కె.దశరథ, జి.యాదయ్య, పశు వైద్య సిబ్బంది జంగయ్య, మాధవి, నరేశ్, అప్సర్, ఆరీఫ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు మందులు అందిస్తున్న పశువైద్యులు

కార్పొరేషన్‌లో కబ్జాలను అరికట్టాలి

బీజేపీ మాజీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని చాలా డివిజన్లలో ఓపెన్, పార్కు స్థలాలు అక్రమాలకు గురవుతున్నాయని ఎమ్మెల్యే స్పందించి కబ్జాలను అరికట్టాలని బీజేపీ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. నాదర్‌గుల్‌లోని పార్టీ కార్యాలయంలో వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సమస్యలపై ఎమ్మెల్యే స్పందించాలని కోరారు. కోట్లు విలువచేసే స్థలాలు కొందరి అధికారులు అడ్డం పెట్టుకొని కాజేస్తున్నారన్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ప్రభుత్వ అధికారులు స్పందించడం లేదన్నారు. కార్పొరేషన్‌లోని పలు డివిజన్‌లలో అభివృద్ధి పనులు అర్ధంతరంగా ఆగిపోయాయన్నారు. ఎస్ఎన్‌డీపీ నాలా పనులు పెద్దబావి మల్లారెడ్డి ఫంక్షన్‌హాల్ వద్ద ఇరిగేషన్ నాలా అక్రమాలకు గురై మధ్యలోనే ఆగిపోయిందన్నారు. కార్పొరేషన్‌లో నిధులు లేకపోయినా ఎజెండాలో పొందుపరిచి టెక్నికల్ పర్మిషన్ లేకపోయినా దొడ్డిదారిన గుత్తేదార్లు పనులు చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే సబితారెడ్డి పట్టించుకొని బడంగ్‌పేట కార్పొరేషన్‌ను సరిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేషన్ 1, 2 అధ్యక్షులు రాళ్లగూడం రామకృష్ణారెడ్డి, రామిడి వీరకర్ణారెడ్డి తత్రి మల్లేశ్ తదితరులు ఉన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో పాల్గొన్న భారతీయ కిసాన్ సంఘం నాయకులు

భారతీయ కిసాన్ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి

చేవెళ్ల: రైతు సమస్యలను పరిష్కరించడంలో భారతీయ కిసాన్ సంఘం ముందుంటుందని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ కార్యాలయం వద్ద సోమవారం భారతీయ కిసాన్ సంఘం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో రైతుల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు సంఘం కృషి చేస్తోందన్నారు. మండలంలోని కందవాడ గ్రామంలో పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించామని తెలిపారు. రెవెన్యూ సమస్యలపై కూడా సంబంధిత అధికారులను కలిసి వినతిపత్రాలు అందించామన్నారు. ప్రతి గ్రామంలో సంఘం కమిటీలను వేసి రైతులకు అండగా ఉండాలన్నారు. సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలపై చర్చించినట్లు చెప్పారు. ప్రధానంగా రైతులకు వ్యవసాయశాఖ, విద్యుత్, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలే ఎక్కువగా ఉంటాయని వీటిని ఎప్పటికప్పుడూ గుర్తించి పరిష్కరించేందుకు సంఘం నిరంతరం పనిచేస్తోందన్నారు. సమావేశంలో జిల్లా కోశాధికారి పెంటారెడ్డి, మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కార్యదర్శి వీరేశం, సభ్యులు శివుడు, శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, విశ్వనాథం, దేవయ్య, మల్లేశ్, నర్సింహారెడ్డి, బాల్‌రాజ్, రైతులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత చదువులతో మంచి భవిష్యత్ పొందాలని హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు మూడే రవినాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని అమ్డాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ రోజు 40 మంది విద్యార్థులకు పదో తరగతి పరీక్షలకు సంబంధించిన పరీక్ష సామగ్రి అందించారు. విద్యతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల అభివృద్ధికి ట్రస్ట్ ద్వారా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుక, మహేశ్వరి, శోభారాణి, జ్యోతి, సత్యనారాయణ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం

- బీఆర్ఎస్ హయాంలో చేసిన పనులే కనిపిస్తున్నాయ్
- మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: ఏడాది కాలంగా రాష్ట్రంలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి శూన్యమేనని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ హయాంలో చేసిన అభివృద్ధే కనబడుతోందన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో పార్టీ మండల అధ్యక్షుడు కొత్త కిషన్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్‌తో కలిసి.. భవిష్యత్ కార్యాచరణ, మండల, గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ విస్తరణ, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వంపై వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలపై వివరించారు. సమావేశంలో మాజీ అధ్యక్షుడు పూజారి చక్రవర్తిగౌడ్, సహకార సంఘం మాజీ చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డి, మాజీ సర్పంచులు నోముల జగదీష్, కిరణ్ కుమార్‌గౌడ్, సీనియర్ నాయకులు జక్క రాంరెడ్డి, తొర్పునూరి ధనుంజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మంచాల: మండల పరిధి ఆరుట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2004– 2005 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న నాటి విద్యార్థులు ఓ వేదికగా సోమవారం సందడి చేశారు. రెండు దశాబ్దాల అనంతరం కలుసుకున్న బాల్య మిత్రులు.. ఆప్యాయంగా పలకిరించుకున్నారు. నాటి జ్ఞాపకాలు గుర్తుకు చేసుకుంటూ కేరింతలు కొట్టారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలు అందజేసి ఆశీస్సులు పొందారు.



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386